క్లుప్తంగా

విద్యుత్ తీగలు తగిలి గడ్డి వ్యాన్‌కు మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెళ్లకూరు: మండలంలోని కప్పగుంటకండ్రిగ సమీపంలో శనివారం విద్యుత్ తీగలు తగిలి గడ్డి మోపులు తరలిస్తున్న వ్యానులో మంటలు చెలరేగాయి. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల నుంచి గడ్డిని వ్యాన్‌లో తరలిస్తుండగా విద్యుత్ తీగలు రాసుకోవడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో సుమారు 50 గడ్డి మోపులు కాలిపోయాయి. సుమారు రూ.ఐదు వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

పెళ్లకూరు: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో ప్రమీలారాణి మాట్లాడుతూ మండలానికి 30 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటికి 239 మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. బ్యాంకు మేనేజర్లతో కలిసి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని, లబ్ధిదారుల ఎంపిక జాబితాను త్వరలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు ఎం.రాజేష్, ఫణీంద్ర, నాగాంజనేయులు, నిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.50 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న నేహాన్ని

రాపూరు : మండలంలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాదుకు చెందిన ఉప్పలపాటి నేహాన్ని శనివారం రూ.1.50 లక్షలు విరాళం ఇచ్చినట్టు ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. దాతకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు సీతారామయ్య స్వామి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పేదలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ పెంచలయ్య

నాయుడుపేట టౌన్ : వైద్య సేవల కోసం ప్రైవేటు వైద్యశాలలకు వచ్చే పేదలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించాలని వైఎస్సార్ జిల్లా కడపలోని రిమ్స్ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పెంచలయ్య సూచించారు. నాయుడుపేటలో ఏర్పాటు చేసిన నీలిమ ప్రియదర్శిని ఈఎన్‌టీ వైద్యశాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేట ప్రజలు ఈఎన్‌టీ వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ట్రినిటీ ఆస్పత్రుల చైర్మన్ ఆదవరం నాగూరయ్య ఆధ్వర్యంలో డాక్టర్ నీలిమ ప్రియదర్శిని, డాక్టర్ అనుదీప్ ఇక్కడే ఈఎన్‌టీ వైద్య సేవలను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట రోటరీ క్లబ్ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు : రెవెన్యూ శాఖలో అవినీతి పెరిగిపోతోందని, తీరుమార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హెచ్చరించారు. ఆయన శనివారం గూడూరులోని క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎక్కువ మంది రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది, అధికారులు డబ్బులు దండుకోవడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. పేద ప్రజల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బల్లవోలులో పశువైద్య శిబిరం

చిల్లకూరు : మండలంలోని బల్లవోలులో శనివారం కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, అదానీ ఫౌండేషన్ సహకారంతో పశు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ వెంకటేశ్వర్లు, షఫీ, సాయినాథ్, నవీన్, జేవీవో కామాక్షి, బాబు, టీపీఏ వెంకటకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలువ గండి పూడ్చేదెన్నడో..?



చెరువు కిందసాగు చేసిన వరి పంట

తెలుగు గంగ కాలువ నీటిని నమ్ముకుని వరి పంట సాగు చేసిన రైతులకు కన్నీరు తప్పడం లేదు. కాలువకు పడిన గండిని పూడ్చకపోవడంతో నీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. చెరువులో నీరు తగ్గిపోతుండడం, పంట ఎండిపోయే స్థితిలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువ గండిని పూడ్చి నీరు అందించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

- చెరువులో నీరు అడుగంటుతుండడంతో రైతుల్లో ఆందోళన
- కాలువను బాగు చేసి నీరు విడుదల చేయాలని వేడుకోలు
- లేకుంటే పంట ఎండిపోతుందని ఆవేదన



చెరువులో వున్న కొద్దిపాటి నీరు



కాలువకు పడిన గండి

సైదాపురం : మండలంలోని కమ్మవారిపల్లి చెరువు కింద 90 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ చెరువుకు కండలేరు నుంచి వచ్చే తెలుగు గంగ కాలువ ద్వారా నీరు సరఫరా చేస్తారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రాగనరామాపురం వద్దనున్న కాలువకు గండి పడింది. దాన్ని పూడ్చాలని రైతులు పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. దీంతో గండి పూడుస్తారని, కాలువ ద్వారా గంగ నీరు వస్తుందని సైదాపురం, కమ్మవారిపల్లి గ్రామాలకు చెందిన రైతులు భావించారు. చెరువులో కొద్దిపాటి నీరు ఉందని, తర్వాత ఎటూ గంగ కాలువ నీరు వస్తుంది కదా అని 90 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట పొట్ట దశకు చేరుకుంది. కాలువకు పడిన గండిని పూడ్చలేదు. చెరువులో నీరు తగ్గిపోతోంది. ఈ క్రమంలో నీరు లేకుంటే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 51 టీఎంసీల నీరు ఉందని, కాలువకు పడిన గండిని పూడ్చి చెరువుకు నీరు విడుదల చేస్తే పంటను కాపాడుకునే అవకాశం ఉంటుందని కోరుతున్నారు. లేనిపక్షంలో పంట సాగుకు చేసిన అప్పులు తీర్చుకునే మార్గం లేక ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఆత్మహత్యే శరణ్యం



“ చెరువుకు గంగ కాలువ నుంచి నీరు వస్తుందని భావించి మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాను. సాగుకు రూ.1.20 లక్షలు ఖర్చు చేశాను. ప్రస్తుతం పంట పొట్ట దశకు చేరుకుంది. చెరువులో నీరు అడుగంటిపోతోంది. కాలువ నుంచి నీరు విడదల చేయకపోతే పంట ఎండిపోతుంది. అధికారులు కనికరించి గండిని పూడ్చి నీటిని విడుదల చేయాలి. లేకుంటే ఆత్మహత్యే శరణ్యం.

– పుల్లయ్య, కౌలు రైతు, సైదాపురం

ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు



కమ్మవారిపల్లి చెరువుకు సాగు నీరు అందించే తెలుగు గంగ కాలువకు రాగనరామాపురం వద్ద గండి పడింది. దాన్ని పూడ్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెబుతున్నారు. ఇప్పటి వరకు గండిని మాత్రం పూడ్చలేదు. ప్రస్తుతం చెరువులో నీరు తక్కువగా ఉంది. కాలువ నీరు రాకపోతే పంటలు ఎండిపోతాయి. అధికారులు స్పందించాలి.

– కె మోహన్‌రావు, సైదాపురం

అధికారులు తక్షణమే స్పందించాలి



కాలువ నీరు వస్తుందని భావించి చెరువులో నీరు తక్కువగా ఉన్నా అప్పులు చేసి మరీ వరి పంటను సాగు చేశాం. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. అధికారులు మాత్రం గండి పూడ్చడం గురించి పట్టించుకోవడం లేదు. చెరువుకు కాలువ నీరు రాకపోతే పంట ఎండిపోతుంది. అధికారులు తక్షణం స్పందించి గండి పూడ్చడంపై దృష్టి పెట్టాలి. లేకుంటే పంట ఎండిపోయి తీవ్రంగా నష్టపోతాం.

– ఓబులు నాయుడు, కమ్మవారిపల్లి

ఘోషాస్పత్రిని ప్రారంభించాలి

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పరిసర ప్రాంతాల ప్రజలకు విశేష సేవలు అందించిన ఘోషాస్పత్రిని పునఃప్రారంభించాలని వైఎస్సార్ సీపీ ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఆరి శంకరయ్య కోరారు. ఆయన శనివారం ఘోషాస్పత్రిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు సురక్షిత ప్రసవాలు నిర్వహిస్తూ ఘోషాస్పత్రి అండగా నిలిచిందన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో ఆస్పత్రిని మూసివేశారని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆస్పత్రిని ప్రారంభించాలని కోరారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

వెంకటగిరి రూరల్ : ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ రమణయ్య కోరారు. ఆయన శనివారం వెంకటగిరిలోని కాళహస్తి శేషయ్య స్మారక భవనం వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మిల్లర్లు, దళారులతో కుమ్మక్కై ధాన్యం ఎగుమతికి అనుమతులు ఇవ్వకుండా ధరలు తగ్గిస్తోందన్నారు. రెండేళ్ల క్రితం 75 కేజీల బస్తా రూ.2,300 ధర పలికిందని, ప్రస్తుతం బీపీటీలు రూ.1,600, ఆర్ఎన్ఆర్‌లు రూ.1750ల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం ఖర్చు పెరగడం, దిగుబడి తగ్గిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యకరంగా మారిందన్నారు.కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు ఊంజల్ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. తదుపరి సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పరీక్షల్లో ఒత్తిడికి లోనుకావద్దు



పెళ్లకూరు : విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న కేఆర్ ట్రస్ట్ అధినేత వేలూరు కళ్యాణ్‌రెడ్డి



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం జ్యోతి



వాకాడు: విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న దాతలు

పెళ్లకూరు: విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కేఆర్ ట్రస్ట్ అధినేత వేలూరు కళ్యాణ్‌రెడ్డి తెలిపారు. శిరసనంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు శనివారం అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించే వారికి ట్రస్ట్ తరఫున ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. హరిబాబురెడ్డి, సాయిగిరిధర్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సరస్వతి దేవి పూజ

చిట్టమూరు : ఆరూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పల్లం వెంకటేష్ పరీక్ష సామగ్రి అందజేశారు. హెచ్‌ఎం జ్యోతి, టీచర్లు వెంకటేశ్వర్లు, చలపతి, మీరయ్య, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

మండలంలోని అరవపాళెం, ఈశ్వరవాక, చిట్టమూరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గూడూరుకు చెందిన శ్రీసత్యసాయి సేవా సంస్థ సౌజన్యంతో ఏవో భవాని విద్యా సామగ్రి అందజేశారు. సంస్థ కన్వీనర్ దాముప్రతాప్, సేవాదళ్ ఇన్‌చార్జి మల్లికార్జునరావు, బాలవికాస్ విద్యార్థి శ్రీనాథ్ సాయి పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు : మండలంలోని వాలమేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వాకాడు చర్చి కాంపౌండుకు చెందిన హెడ్ కానిస్టేబుల్ సొటూరు ప్రసాద్‌రావు, ఉపాధ్యాయరాలు ప్రసన్న పరీక్ష సామగ్రి అందజేశారు.

కలువాయిలో..

కలువాయి: కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి పూజను ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రాజా తమ సొంత నిధులతో ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. హెచ్‌ఎం అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి రథోత్సవం



రథంలో కొలువుదీరిన వేణుగోపాల స్వామి

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడులో వెలసిన వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. రుక్మిణీ, సత్యభామ సమేతంగా వేణుగోపాల స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంలో కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం భక్తుల గోవిందనామ స్మరణల మధ్య రథాన్ని లాగారు. వంశపారంపర్య ధర్మకర్తలు కిడాంబి గోపాలకృష్ణ, కిడాంబి శ్రీనివాస రామానుజం, ఆలయ నిర్వాహకులు సెల్వం స్వామి తదితరులు పాల్గొన్నారు.

గంధోత్సవానికి పటిష్ట భద్రత



అమీర్ షావలి దర్గా పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హజరత్ అమీర్‌షావలి దర్గా ఉరుసులో భాగంగా గంధోత్సవానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేస్తున్నట్టు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఆయన శనివారం సీఐ బాబితో కలిసి దర్గా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. దర్గా ముజావర్లు, నిర్వహణ కమిటీ సభ్యులతో మాట్లాడి ఉరుసు నిర్వహణ, కార్యక్రమాలపై ఆరా తీశారు. గతంలో లాగే బజారు కూడలి వీధి సమీపంలో ఉన్న దొర్నాదుల చెంచు కృష్ణయ్య నివాసం నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తామని దొర్నాదుల వాసు డీఎస్పీకి వివరించారు. ఉరుసు జరిగే మూడు రోజులు దర్గాతో పాటు అన్ని ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు, ప్రాంగణంలో రెండు ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేయాలని సీఐ బాబికి సూచించారు. దర్గా ముజావర్లు సుభాని, హిదయతుల్లా, దొర్నాదుల వాసు, దాము తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూమి ఇవ్వాల్సిందే



భూ ఆక్రమణ కార్యక్రమంలో పాల్గొన్న పేదలు

సైదాపురం: మండలంలోని ఊటుకూరు సమీపంలో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీ లీజు ముగిసిన భూములను శనివారం అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య ఆధ్వర్యంలో నిరుపేదలు ఆక్రమించుకున్నారు. పోలయ్య మాట్లాడుతూ ఊటుకూరు సమీపంలో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి ఊటుకూరు సర్వే నంబర్ 3, 20, 25–1, తురిమెర్లలో సర్వే నంబర్లు 460, 461లో 178 ఎకరాల ప్రభుత్వ భూమిని మైనింగ్ లీజుకు ఇచ్చినట్టు తెలిపారు. లీజు గడువు 2023 ఆగస్టు 15 నాటికి ముగిసిందన్నారు. అందులోని భూములను పేదలకు కేటాయించాలని పలు మార్లు కోరినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో నిరుపేదలతో కలిసి భూములను ఆక్రమించుకున్నట్టు తెలిపారు. వాటికి పట్టాలు ఇచ్చి పేదలను ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

నాయుడుపేట టౌన్ : పదో తరగతి పరీక్షల నిర్వహణకు నాయుడుపేటలో ఆరు కేంద్రాలు ఏర్పాటుచేశామని, వాటిలో పిల్లలకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో మునిరత్నం తెలిపారు. పట్టణంలో ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ప్రశ్న పత్రాలను శనివారం ఆయా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో భద్ర పరిచారు. 17 నుంచి 31 వరకు పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. 31న రంజాన్ పండుగ వస్తే తేదీ మారే అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలోని బాలుర గురుకులంలో 270 మంది, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 236 మంది, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 180 మంది, ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాలలో 260 మంది, సెయింట్ మేరీస్ పాఠశాలలో 212 మంది, నారాయణ పాఠశాలలో 226 మంది పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు.

వాహనాల తనిఖీ

నాయుడుపేట టౌన్ : ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని నాయుడుపేట అర్బన్ సీఐ బాబి హెచ్చరించారు. ఆయన శనివారం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. అయ్యప్పరెడ్డిపాళెం నుంచి రాంగ్ రూట్‌లో వస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. డ్రైవర్ కుంపటి శేఖర్‌పై కేసు నమోదు చేశారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు సమష్టి కృషి



నాయుడుపేట టౌన్ : పుదూరు బాలికల గురుకులంలో విద్యార్థుల మానవ హారం



చిల్లకూరు : చెత్తను ఎత్తివేసి ప్రతిజ్ఞ చేస్తున్న అటవీ అధికారులు


సైదాపురం/ఓజిలి/కోట/తడ/నాయుడుపేట టౌన్/వెంకటగిరి రూరల్/వాకాడు/కలువాయి/దక్కిలి/చిల్లకూరు/సూళ్లూరుపేట: వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో శనివారం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర సాధనకు సమష్టి కృషి అవసరమని అధికారులు, ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. మానవ హారాలు ఏర్పాటుచేసి స్వచ్ఛతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. సైదాపురం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఓజిలి ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, డీఎల్‌పీవో రవీంద్రబాబు, గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ, తడ ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీపీ కె.రఘురెడ్డి, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఎంపీడీవో సురేష్‌బాబు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి, వాకాడు ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ రామయ్య, దక్కిలి ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి, గూడూరు ఎఫ్‌ఆర్‌వో డీవీ రమణయ్య, సెక్షన్ ఆఫీసర్లు గాయం శ్రీనివాసులు, ధనలక్ష్మీ, బీట్ అధికారులు రవీంద్ర, వెంకటేశ్వర్లు, గోపి, రవి, సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రమేష్, మెప్మా సీఎంఎం భాస్కర్, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




వాకాడు : ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



కలువాయి: ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న అధికారులు




సైదాపురంలో మానవ హారం ఏర్పాటుచేసిన అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది



ఓజిలి: ర్యాలీ చేస్తున్న అధికారులు



కోట : కేసవరంలో దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో



తడ: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది